నాలుగు పథకాలపై అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

## అర్హులకు ప్రభుత్వ పథకాలు అందాలి

### మేయర్ గుండు సుధారాణి

వరంగల్, జనవరి 15 : అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఆమె వార్డు ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు పథకాలకు గ్రేటర్ పరిధిలో లబ్ధిదారుల ఎంపిక నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. నోడల్, వార్డు ప్రత్యేక అధికారుల బృందాలు నిబద్ధతతో పని చేయాలన్నారు. వార్డు సభలను పక్కాగా నిర్వహించాలన్నారు. 16వ తేదీ నుంచి చేపట్టనున్న క్షేత్రస్థాయి సర్వేను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. డేటా ఎంట్రీ తప్పులు లేకుండా చేపట్టాలని సూచించారు. గ్రామ సభలకు ఫ్లెక్సీలు, మౌలిక వసతులు సమకూర్చుకోవాలన్నారు. వార్డు సభలకు ముందు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. నాలుగు ప్రభుత్వ పథకాలపై సందేహాల నివృత్తి కోసం బల్దియా టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 1980, 9701999645లో సంప్రదించాలని ప్రజలకు సూచించారు. కమిషనర్ అశ్విని మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో సర్వే చేసే బృందాలు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే గురువారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, వరంగల్ ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ప్రత్యేకాధికారి పుష్పలత, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## వీధి దీపాల ఏర్పాటు

### 'నమస్తే' కథనానికి స్పందన

వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నయీంనగర్, జనవరి 15 : మూడు నెలల తర్వాత వీధి దీపాలు వెలుగుతున్నాయి. వీధి లైట్లు లేక జనాల ఇబ్బందులు పడుతున్నారని 'నమస్తే'లో పండుగ పూట చీకట్లే.. వెలగని వీధి దీపాలు.. పట్టించుకోని అధికారులు అంటూ సోమవారం వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు బుధవారం కోమటిపల్లి, భీమారం, శ్రీనివాస కాలనీ, వినాయక, నక్షత్ర కాలనీల్లో కొత్త లైట్లు అమర్చారు.

## చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కాజీపేట, జనవరి 15 : కాజీపేట రైల్వే స్టేషన్‌లో వందేభారత్ రైలు వృద్ధుడిని ఢీకొట్టింది. దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే స్టేషన్‌లోని మూడో నంబర్ ప్లాట్ ఫారంపై మంగళవారం రాత్రి విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న వందేభారత్ రైలు వృద్ధుడిని ఢీకొట్టింది. అతడికి తీవ్ర గాయాలై స్పృహ కోల్పోవడంతో రైల్వే అధికారులు చికిత్స కోసం 108 వాహనంలో ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వయసు 60-65 ఏళ్ల మధ్య ఉంటుందని, బ్లూ కలర్ ఆఫ్ షర్టు, గీతల లుంగీ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీలో భద్రపరిచామని, సంబంధీకులుంటే కాజీపేట జీఆర్పీస్టేషన్ లేదా 8712658609, 8712569496లో సంప్రదించాలని కోరారు.

## 20న లక్ష డప్పుల సన్నాహక ప్రదర్శన

న్యూ శాయంపేట, జనవరి 15 : నగరంలో ఈ నెల 20వ తేదీన లక్ష డప్పుల సన్నాహక ప్రదర్శన నిర్వహిస్తున్నామని, ప్రతి గ్రామం నుంచి వేలాది డప్పులతో మాదిగలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ పిలుపునిచ్చారు. హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో బండారి సురేందర్ అధ్యక్షతన హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీల్లో ఉమ్మడి రిజర్వేషన్ విధానం అమలు కావడం వల్ల ఒక్క మాల కులం మాత్రమే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, వర్గీకరణ అమలైతే ఎస్సీలోని 59 కులాలు అభివృద్ధి చెందుతాయన్నారు.. అందరికి న్యాయం జరగడం ఓర్చుకోలేని స్వార్థపరులైన మాలలు ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నేతలు మంద కుమార్, వేల్పుల సూరన్న, బొడ్డు దయాకర్, జన్ను దినేశ్, గద్దల సుకుమార్, కట్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

# ఫీల్డ్ వెరిఫికేషన్ పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ ప్రావీణ్య
- క్లస్టర్‌స్థాయి అధికారుల అవగాహన, శిక్షణ శిబిరం సందర్శన
- అధికారులకు పలు సూచనలు

ఆత్మకూరు : అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కమలాపూర్ : సమావేశంలోమాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

ఆత్మకూరు, జనవరి 15 : గ్రామ స్థాయిలో ఫీల్డ్ వెరిఫికేషన్ పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డ్సులు, ఇందిరమ్మ ఇండ్ల స్కీములపై బుధవారం గ్రామ, క్లస్టర్ స్థాయి అధికారులకు నిర్వహించిన ఒక రోజు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 16 నుంచి 20వ తేదీ వరకు నాలుగు స్కీములకు సంబంధించిన ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసి 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే గ్రామ సభల్లో జాబితా చదివి ప్రజలకు వినిపించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో నారాయణ, మండల ప్రత్యేకాధికారి రాజేందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీవో రాజిరెడ్డి, ఎంఈవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### పథకాలు ప్రజలకు చేరేలా చూడాలి..

కమలాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చూడాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26న ప్రభుత్వం ఆత్మీయ భరోసా, ఆహార భద్రత కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. పథకాల అమలులో పాటించాల్సిన మార్గదర్శకాలపై సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పేదలకు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ రవీందర్, ఎంపీడీవో బాబు, తహసీల్దార్ సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కొత్త రేషన్ కార్డులపై సర్వే చేయాలి..

శాయంపేట : కొత్త రేషన్ కార్డులపై గురువారం నుంచి గ్రామాల్లో ఫీల్డ్ వెరిఫికేషన్ చేయాలని పరకాల ఆర్డీవో నారాయణ అన్నారు. ఈ నెల 26 నుంచి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, క్లస్టర్ సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులగణన జాబితా ఆధారంగా రేషన్ కార్డు లేనివారి ఇంటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. 20వ తేదీలోగా సర్వే పూర్తి చేసి అర్హులను ఎంపిక చేయాలన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, అధికారులు సాగులో లేని భూములను గుర్తించాలని చెప్పారు. ఆత్మీయ భరోసా కింద భూమి లేని వారిని గుర్తించి ప్రభుత్వానికి పంపించినట్లు చెప్పారు. అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లు అందించాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ఎంపీడీవో ఫణిచంద్ర, తహసీల్దార్ సత్యనారాయణ, ఏవో గంగా జమున పాల్గొన్నారు.

### సమగ్ర నివేదిక అందించాలి..

దామెర : మండల కేంద్రంలోని రైతు వేదికలో సంక్షేమ పథకాలపై సిబ్బందికి ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి బాలరాజు మాట్లాడుతూ.. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు నాలుగు స్కీములపై ఫీల్డ్ వెరిఫికేషన్‌ను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో రంగాచారి, ఏపీవో శారద పాల్గొన్నారు.

### పారదర్శకత పాటించాలి..

హసన్‌పర్తి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు పారదర్శకత పాలటించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చల్లా ప్రసాద్, ఎంపీవో కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేపు కలెక్టరేట్‌లో 'ఎస్సీ నేషనల్ కమిషన్' సమీక్ష

హనుమకొండ, జనవరి 15 : ఈ నెల 17వ తేదీన షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఫర్ నేషనల్ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ జిల్లాకు రానున్నారని కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకనటలో తెలిపారు. పర్యటనలో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో షెడ్యూల్డ్ కులాల వారికి కల్పించిన హక్కులు, రక్షణ అమలు, బాధితులు, బాధిత కుటుంబానికి చెల్లించే బకాయిలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని చెప్పారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

## ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోండి

హనుమకొండ చౌరస్తా, జనవరి 15 : కొత్తకొండ వీరభద్రస్వామి జాతరకు ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. కొత్తకొండ జాతర కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి రోజుకు 50 నుంచి 60 ప్రత్యేక ట్రిప్పులు నడుపుతున్నామన్నారు. గురువారం ట్రాఫిక్ ఆధారంగా అదనపు బస్సులు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ సంవత్సరం సుమారు 4వేల మంది భక్తులు ప్రయాణించేలా ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

ఎల్కతుర్తి జనవరి 15 : మండలంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన తాడూరి కొమురయ్య ఇటీవల మృతి చెందగా, బుధవారం బీఆర్ఎస్ నాయకులు అతడి కుటుంబాన్ని పరామర్శించి 50కిలోల బియ్యం అందించారు. గ్రామ అధ్యక్షుడు అంబాల రాజ్‌కుమార్, నాయకులు సందెల నరేశ్, కడారి సందీప్, సాతూరి నరేశ్, మిట్టపల్లి దినేశ్, కడారి సురేశ్, జన్ను వంశీ పాల్గొన్నారు.

## రేపటి నుంచి పోలీసు క్రీడా పోటీలు

సుబేదారి, జనవరి 15 : వరంగల్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి 17నుంచి 19వ తేదీ వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. జేఎన్ఎస్ మైదానంలో వాలీబాల్, హ్యాండ్ బాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

## వేయిస్తంభాల ఆలయంలో గోమాతకు పూజలు

హనుమకొండ చౌరస్తా, జనవరి 15 : వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో కనుమ పండుగ సందర్భంగా రుద్రేశ్వరునికి రుద్రాభిషేకాలు నిర్వర్తించిన అనంతరం గోమాత, బసవన్నకు పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, మణికంఠశర్మ, ప్రణవ్, శ్రావణ్, గణపతి పాల్గొన్నారు.

## అప్పుడు బల్కంపేట.. ఇప్పుడు కొత్తకొండ

- జాతరలో మెకాళ్లపై కూర్చుని మంత్రి పొన్నం ప్రెస్‌మీట్

కొత్తకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హనుమకొండ సబర్బన్, జనవరి 15 : కొత్తకొండ జాతరలో మంత్రి పొన్నం ప్రభాకర్ తీరు చర్చనీయాంశమైంది. మంగళవారం స్వామి వారిని దర్శించుకున్న ఆయన అక్కడినుంచి టెంపుల్ గెస్ట్‌హౌస్ వద్దకు వచ్చీరాగానే కింద కూర్చున్నారు. మంత్రి కింద కూర్చోవడంతో పోలీసులు, అధికారులు నివ్వెరపోయారు. కాజీపేట ఏసీపీ తిరుమల్‌తో పాటు మరికొందరు పోలీసులు పొన్నంను లేపే ప్రయత్నం చేయగా వారిని వారించారు. గతంలో హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం సందర్భంలో నూ మంత్రి నేలపై కూర్చుని అధికారుల తీరుపై నిరసన తెలిపారు. ఇప్పుడు అదే విధంగా కొత్తకొండ జాతర ఏర్పాట్లలో అధికారులు విఫలమయ్యారనే నెపంతోనే నేల మీద కూర్చుని ఇలా చేశారా? అనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే గెస్ట్‌హౌస్‌లో ఇంతమంది పట్టరని కింద కూర్చుని ఆలయ చైర్మన్ కొమరవెల్లి చంద్రశేఖర్‌గుప్తాతో కలిసి ప్రెస్‌మీట్ పెట్టినట్లు పొన్నం తెలుపడం గమనార్హం.

### పోలీసు కుటుంబాలకు రెడ్ కార్పెట్..

కొత్తకొండ జాతరలో మొత్తం పోలీసులదే రాజ్యం అన్నట్లుందని భక్తులు ఆరోపిస్తున్నారు. పోలీసుల కుటుంబాలు ఎక్కడినుంచి వచ్చినా వారికి రెడ్‌కార్పెట్ పరిచి దర్శనం చేయించి ఇతరులను పట్టించుకోలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక దశలో ఆలయ చైర్మన్, ఈవో సైతం అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. కాగా జాతరను కవర్ చేసేందుకు వచ్చిన పాత్రికేయులు కూడా గతానికి భిన్నంగా ఇబ్బందులు పడ్డట్లు చెప్పారు.

## సామాజిక సేవలో ముందుండాలి

వరంగల్, జనవరి 15 : తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం సామాజిక సేవలో మరింత ముందుండాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి మేన శ్రీను అన్నారు. బుధవారం నేత హాస్టల్‌లో జిల్లా అధ్యక్షుడు కోడం రవిప్రకాశ్ అధ్యక్షతన జరిగిన సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా క్యాలెండర్ ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, సాయిరాజ్, సురేశ్, నాగరాజు, రాజమౌళి, లింగమూర్తి, రమేశ్, శివప్రసాద్, రజిత, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## పలు ఇళ్లల్లో నగల చోరీ

దామెర, జనవరి 15 : మండలంలోని పలు గ్రామాల్లో దొంగలు ఇండ్లల్లో చొరబడి బంగారు, వెండి నగలు, నగదు ఎత్తుకెళ్లారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామెర గ్రామానికి చెందిన మాదారపు విజయ కిరాణా షాపు నిర్వహిస్తోంది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు ఇంటి తాళం పగులగొట్టి రూ.4.30లక్షల విలువైన 7తులాల బంగారు గొలుసులు, 13 తులాల పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. ఓగులాపురం గ్రామానికి చెందిన కనుకుంట్ల జ్ఞానేశ్వర్ ఇంటిలో రూ.లక్ష నగదు, 15తులాల వెండి గొలుసులు, ఇదే గ్రామానికి చెందిన పసునూటి విజేందర్ ఇంటిలో దేవుడి గల్లాపెట్టెలోని రూ.4,500 దొంగలు చోరీ చేశారు. ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన శాతరాసి మౌనాకర్ ఇంటి తాళాలను పగులగొట్టి బీరువాలో ఉంచిన రూ.50వేల నగదు, రెండు తులాల నెక్లెస్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. తక్కళ్లపహాడ్ గ్రామంలోని కొత్తపల్లి రాజు, మామిడాల ఈశ్వరయ్య ఇంటి తాళాలను దొంగలు పగులగొట్టి విలువైన చీరెలను దొంగిలించారు. ఘటనా ప్రదేశాలను పరకాల ఏసీపీ సతీశ్‌బాబు, సీఐ రంజిత్‌రావు, ఎస్సై కొంక అశోక్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 71 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కమలాపూర్, జనవరి 15 : మండల కేంద్రంలోని లక్ష్మీగణపతి ఫంక్షన్ హాల్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు 71క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు సీఐ హరికృష్ణ బుధవారం తెలిపారు. పంగిడిపల్లి రైస్‌మిల్ యజమాని మంద శ్రీనివాస్ తనకు చెందిన లక్ష్మీ గణపతి ఫంక్షన్ హాల్‌లోని వంటగదిలో రేషన్ బియ్యం నిల్వ చేశాడనే సమాచారం మేరకు తనిఖీ చేయగా 71క్వింటాళ్లు పట్టుబడినట్లు చెప్పారు. రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని వ్యాపారి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

## కబడ్డీ, వాలీబాల్ విజేతలకు బహుమతుల ప్రదానం

ఆత్మకూరు, జనవరి 15 : ఆత్మకూరులో బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు పాపని రవీందర్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హాజరై మంగళవారం విజేతలకు బహుమతులు అందజేశారు. వాలీబాల్, కబడ్డీ క్రీడల్లో ప్రథమ బహుమతి రూ.3,500, ద్వితీయ బహుమతి రూ.2,500 ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు నత్తి సుధాకర్, వీర్ల వెంకటరమణ, మాజీ ఉప సర్పంచ్ రేవూరి సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఐనవోలు క్రికెట్ జట్టుకు మొదటి బహుమతి

ఐనవోలు : వర్ధన్నపేట మండలం బండౌతాపురం గ్రామంలో వర్ధన్నపేట, జఫర్‌గఢ్, ఐనవోలు మండలాలకు చెందిన క్రికెట్ జట్లతో మండల స్థాయి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. సుమారు 30 జట్లు పాల్గొనగా, కెప్టెన్ సాంబారి శివ సారథ్యంలో ఐనవోలు క్రికెట్ జట్టు మంగళవారం బండౌతాపురం గ్రామ జట్టుతో జరిగిన హోరాహోరీ పోరులో 27 పరుగుల తేడాతో విజయం సాధించింది. ప్రథమ బహుమతిగా రూ.15,016 నిర్వాహకులు అందజేశారు.

## క్రీడలతో మానసిక ప్రశాంతత

కాజీపేట, జవరి 15 : నిత్యం విధుల్లో బిజీగా ఉండే రైల్వే కార్మికులకు క్రీడలతో మానసిక ప్రశాంతత దొరుకుతుందని సీనియర్ డీఎంఈ ఎన్వీ వెంకట్ కుమార్, రైల్వే ఇన్‌స్టిట్యూట్ చైర్మన్, సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణసాయి అన్నారు. కాజీపేట రైల్వే స్టేడియంలో 76వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రైల్వే కార్మికులకు సికింద్రాబాద్ డివిజన్ స్థాయిలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ.. క్రీడలు శారీర, మానసిక ఉల్లాసానికి దోహద పడుతాయన్నారు. అంతకు ముందు ఆలేరు ఇంజినీరింగ్ జట్టు, అమిగోస్ లోకో పైలట్ జట్ల మధ్య జరిగే క్రికెట్ మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్, సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, పిల్లలమర్రి రవీందర్, ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ రాజయ్య, కోశాధికారి గిరిమిట్ల రాజేశ్వర్‌రావు, సభ్యులు ప్రశాంత్, ప్రవీణ్, రఘు, రవికిరణ్, ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, జనవరి 15 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని రాఘవేంద్రనగర్, స్నేహనగర్, బాలయ్య హోటల్ ఏరియాల్లో ఉదయం 9 నుంచి 11గంటల వరకు, బాలసముద్రం సబ్ స్టేషన్ పరిధిలోని పద్మాక్షి కాలనీ, శివముక్తిధామం, రాజ్‌పుత్‌వాడ, జయ కాలేజీ ఏరియాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, షిఫ్టింగ్ పనుల నేపథ్యంలో సోమిడి సబ్ స్టేషన్ పరిధిలోని విష్ణుపురి వాటర్ ట్యాంక్, పోలీస్ స్టేషన్, డాక్టర్ వెంకట్‌రెడ్డి ఆస్పత్రి, సాయి షాపూర్జి కాంప్లెక్స్, సోమిడిరోడ్డు, విష్ణుపురి, రహమత్‌నగర్, జూబ్లీ మార్కెట్, వెంకటాద్రినగర్, సోమిడి, కాజీపేట మెయిన్‌రోడ్డు, రైల్వే స్టేషన్, డీ మార్ట్ ఏరియాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

హసన్‌పర్తి, జనవరి 15 : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. సీఐ చేరాలు కథనం ప్రకారం.. బైరాన్‌పల్లికి చెందిన బండి లక్ష్మి (56) మంగళవారం కిరాణా షాపునకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ఆరెపల్లి నుంచి కంఠాత్మకూర్‌కు వెళ్తున్న బైకు ఢీకొట్టగా, పడిపోయింది. గమనించిన స్థానికులు 108 వాహనంలో ఎంజీఎం దవఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## ఎంపీడీవోగా కరుణాకర్‌రెడ్డి బాధ్యతలు

హసన్‌పర్తి, జనవరి 15 : హసన్‌పర్తి ఎంపీడీవోగా ఎంపీవోగా పని చేస్తున్న కరుణాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ప్రవీణ్ కుమార్ ఈటీసీకి బదిలీ కాగా, ఆయన స్థానంలో కరుణాకర్‌రెడ్డి విధుల్లో చేరారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

శాయంపేట, జనవరి 15 : తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కో కన్వీనర్ పొడిశెట్టి గణేశ్ అన్నారు. బుధవారం శాయంపేటలో ఉద్యమకారుల ఫోరం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 19న జరగబోయే చలో మానుకోట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఉద్యమకారుల యాత్రకు మండలం నుంచి పెద్ద ఎత్తున ఉద్యమకారులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఫోరం మండలాధ్యక్షుడు ఇమ్మడిశెట్టి రవీందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా 250 చదరపు గజాల ఇంటి స్థలం, ప్రతి నెలా రూ.25 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీయూఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గిద్దెమారి సురేశ్, పల్లెబోయిన సారయ్య, యూత్ జిల్లా అధ్యక్షుడు కొమ్ముల శివ, మండల కోశాధికారి కానుగుల నాగరాజు, వనం దేవరాజు, తుమ్మ ప్రభాకర్, బాసాని సాంబమూర్తి, నమితబాజి అశోక్, అరికెళ్ల వెంకట్, నాగరాజు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక ఉర్సు

దామెర, జనవరి 15 : మతసామరస్యానికి ప్రతీక అన్నారం షరీఫ్ ఉర్సు అని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తన నివాసం నుంచి అన్నారం యాకూబ్ షరీఫ్ దర్గా ఉర్సుకు గిలాఫ్‌ను మైనార్టీ సోదరుల ద్వారా పంపించారు. జిల్లా మైనార్టీ అధ్యక్షుడు నయీమొద్దీన్, దామెర మాజీ వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, జలాలొద్దీన్, ఇస్మాయిల్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు మన్సూర్ అలీ, సలీమ్, ఆరిఫ్ బీఆర్ఎస్ దామెర, ఆత్మకూరు మండలాధ్యక్షులు రాము, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565